క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ బోటిక్ ఫీడర్, నాదర్‌గుల్ ఫీడర్, 11కేవీ లైన్స్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవీందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు బోటిక్ ఫీడర్ పరిధిలోని వైకేఆర్, జయసూర్య పట్నం, సీబీఎన్‌క్లేవ్, సరస్వతి ఎన్‌క్లేవ్, సాగర్ ఎన్‌క్లేవ్, అంబేడ్కర్ నగర్, మారుతీ నగర్, టెంపుల్ టౌన్, చిల్కూరి ఎన్‌క్లేవ్, రఘు హోమ్స్, శ్రీరామ ఎన్‌క్లేవ్, ఆదిబట్ల శివాలయం, నాదర్‌గుల్ గ్రామం, అయోధ్య నగర్, శాంతి నగర్, ధరణి ఎన్‌క్లేవ్, గ్రీన్ హోమ్స్ కాలనీ, బాలాజి హోమ్స్, మారుతి ఎన్‌క్లేవ్‌లో సరఫరా నిలిపివేయనున్నామని తెలిపారు. నాదర్‌గుల్ ఫీడర్ పరిధిలోని రాఘవేంద్ర హోమ్స్, ట్రెజరర్ ఎన్‌క్లేవ్, వైష్ణవి ఎన్‌క్లేవ్, పీఎంఆర్, కేఎంఆర్‌సీ, వ్యవసాయ కనెక్షన్లకు సరఫరా నిలిపేయనున్నట్లు పేర్కొన్నారు.

రక్తదానానికి ముందుకు రండి


రక్తదానం చేస్తున్న విద్యార్థులు, చిత్రంలో సీఐ వీరబాబు

శంకర్‌పల్లి: అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని మోకిల సీఐ వీరబాబు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసేందుకు విద్యార్థులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చారు. సీఐ వీరబాబు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది పోలీసులు అమరులు అయ్యారని, వారిని స్మరిస్తూ ఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇక్ఫాయ్ లా స్కూల్ డైరెక్టర్ ప్రొ.డా.రవిశేఖర రాజు, డీన్ ప్రతాప్‌రెడ్డి, ఎస్ఐ కోటేశ్వర రావు పాల్గొన్నారు.

గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలి



ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న శ్రీనివాసరావు

అబ్దుల్లాపూర్‌మెట్: దేశం కోసం నిస్వార్థంగా పనిచేసిన అబ్దుల్‌కలాం, నరేంద్రమోదీ వంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ విద్యార్థులకు సూచించారు. గుంతపల్లిలోని అవంతి విద్యాసంస్థల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అవంతి సంస్థల చైర్మన్ ముత్తెంశెట్టి శ్రీనివాస్‌రావు, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండకు చెందిన సాప బుగ్గమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదమ్మ, మహేందర్‌గౌడ్, జంగయ్య, పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి

శంకర్‌పల్లి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పని చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం గోపులారం మాజీ సర్పంచి పాడువు శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మండలం టంగటూర్ గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు ఎమ్మెల్యే ఇంటి వద్ద కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టపడి పని చేసిన వారికి పదవులు వస్తాయని, ఎవరూ అధైర్య పడొద్దని సూచించారు.


కంకర వేసి వదిలేసిన రోడ్డు


సామగ్రి తరలిస్తున్న ఆటోను అడ్డుకున్న కాలనీ వాసులు

ఎక్కడ వేసిన కంకర అక్కడే!

- నెలలు గడుస్తున్నా ముందుకు సాగని రోడ్డు పనులు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న స్థానికులు
- గతంలో చేసిన పనులకే బిల్లులు రాలేదంటున్న కాంట్రాక్టర్
- కాలనీలో డంప్ చేసి కంకర, ఇసుక, సామగ్రి తరలింపునకు ప్రయత్నం
- అడ్డుకున్న కాలనీ వాసులు

తుర్కయంజాల్: మీ కాలనీకి రోడ్డు మంజూరైంది.. పనులను చేపడుతున్నామంటూ మట్టి తవ్వి కంకర పోయడంతో అంతా సంతోషించారు. తమ పదిహేనేళ్ల కష్టాలు తీరినట్లేనని భావించారు. కానీ రోజులు, నెలలు గడుస్తున్నా ఎక్కడ వేసిన కంకర అక్కడే ఉంది. ఈ విషయమై అధికారులను ప్రశ్నించినా సమాధానం చెప్పే వారే లేరు. ఇదిలా ఉండగా చేసిన పనులకే బిల్లులు రావడం లేదంటూ సందరు కాంట్రాక్టర్ కాలనీలో రోడ్డు నిర్మాణం కోసం వేసిన సామగ్రిని తరలించే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధిలోని ఇంజాపూర్ మిధానీ కాలనీవాసులు కోరుతున్నారు.

రూ.25 లక్షల అంచనా వ్యయంతో..

హెచ్ఎండీఏ నిధులు రూ.25 లక్షల అంచనా వ్యయంతో మిధానీ కాలనీలోని రోడ్ నంబర్ 10 నుంచి 2బి వరకు 250 మీటర్ల పనులను చేపట్టడానికి ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ టెండర్ దక్కించుకుంది. రెండు నెలల క్రితం పనులను ప్రారంభించారు. రోడ్డుపై కంకర వేసి వదిలేశారు. ఇటీవల సీసీ పనులను పూర్తి చేస్తామని హడావుడి చేసి, కొంత వరకు ఏర్పాట్లు చేశారు. కానీ ఆటోలను తీసుకువచ్చి సామగ్రిని తరలిస్తుండటంతో కాలనీ వాసులు అడ్డుకున్నారు. మాకు రోడ్డు వేసే వరకు ఇక్కడి నుంచి సామగ్రి తరలించేందుకు ఒప్పుకోబోమని భీష్మించుకుని కూర్చున్నారు. ఇప్పటికే రూ.5 కోట్ల బిల్లులు తమ సంస్థకు పెండింగ్‌లో ఉన్నాయని, అవి చెల్లిస్తేనే రోడ్డు పనులను చేపడతామని కాంట్రాక్టర్ తెలిపారు.

పదేళ్ల క్రితం కూడా..

పదేళ్ల క్రితం ఇంజాపూర్ పంచాయతీగా ఉన్న సమయంలో కూడా అప్పటి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా రోడ్డు పనులను ప్రారంభించి, శిలాఫలకం వేశారని కాలనీ వాసులు గుర్తుచేశారు. ఆ తర్వాత ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా మోక్షం కలగలేదన్నారు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం దొరికిందని భావిస్తున్న తరుణంలో మళ్లీ అర్ధంతరంగా ఆగిపోవడంపై ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రోడ్డు తవ్వడంతో..

రహదారి వేస్తామని చెప్పి, రెండు నెలల క్రితం మట్టి రోడ్డును తవ్వేయడంతో పలు చోట్ల మ్యాన్‌హోళ్లు ధ్వంసమయ్యాయి. ఇటీవల భారీ వర్షాల సమయంలో పలు ద్విచక్ర వాహనాలు, కార్లు వాటిలో పడి పాడయ్యాయని కాలనీవాసులు చెబుతున్నారు. ఇంటి ముందు వేసుకున్న ర్యాంప్‌లను సైతం తొలగించడంతో ద్విచక్ర వాహనాలు, కార్లను గేట్ లోపల పార్క్ చేసుకునే అవకాశం లేకుండా పోయిందంటున్నారు. దీంతో వాహనాలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

సామగ్రిని తరలించం

రోడ్డును వేసి కాలనీ వాసుల సమస్యను పరిష్కరిస్తాం. నిర్మాణంలో జాప్యం జరిగిన మాట వాస్తవమే. రోడ్డు ఒక్క లెవల్ లేకపోవడంతోనే కంకరను తొలగించాలని అనుకున్నాం. కానీ కాలనీ వాసులు నమ్మడం లేదు. సామగ్రిని ఎక్కడికి తరలించకుండా ఉన్నతాధికారులతో మాట్లాడి రోడ్డు పనులను చేపడుతాం.

– రవి, ఆర్అండ్‌బి , ఏఈ

యాచారంలో..

యాచారం: సీజేఐ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తు శుక్రవారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు యాచారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశాయి. పార్టీ మండల అధ్యక్షుడు మూలి మహేశ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ అయ్యప్పకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, రాములు, బోడ కృష్ణ, యాదగిరి, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు చోరీ ప్రమాదకరం

- కాంగ్రెస్ పార్టీ నాయకుల మండిపాటు
- ఎక్వాయిపల్లిలో సంతకాల సేకరణ


కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లిలో సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: దేశంలోని ప్రతీచోట బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడిందని ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాలకూర్ల కరుణాకర్‌గౌడ్ అన్నారు. దీన్ని నిరసిస్తూ శుక్రవారం మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐసీసీ ఆదేశాల మేరకు ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రతి గ్రామంలో వంద మంది సంతకాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. దేశంలో పెద్ద ఎత్తున్న ఓటు చోరీకి పాల్పడి, బీజేపీ మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బాలరాజు, దొడ్లపాటి సుమన్, శంకరయ్య, మల్లేశ్, రమేశ్‌నాయక్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- కడ్తాల్‌లోని బీసీ, ఎస్సీ కాలనీల్లో హైమాస్ట్ లైట్ల ప్రారంభం


హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

కడ్తాల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో రూ.3 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీలు రాములుగౌడ్, లక్ష్మయ్య, జహంగీర్‌బాబా తదితరులు ఉన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

షాబాద్: ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలంగాణ మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు శ్రీనివాసాచారి పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ ఆదర్శ పాఠశాలను ఆయన సందర్శించి, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, లైబ్రరీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ తరగతులను విద్యార్థులకు బోధించే వారు ప్రతిభను పెంచేటట్లుగా కృషి చేయాలన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాఘవేందర్, ఏఎంఒ రవికుమార్ తదితరులున్నారు.

సీపీఆర్‌పై 108 సిబ్బంది అవగాహన



కొత్తూరు: సీపీఆర్‌పై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తూరు: అనుకోకుండా గుండెనొప్పి బారిన పడే వారికి ఏ విధంగా సీపీఆర్ చేసి రక్షించాలో కొత్తూరు పట్టణంలో 108 అంబులెన్స్ సిబ్బంది అవగాహన కల్పించారు. శుక్రవారం దర్గారోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఆర్‌తో కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేశారు. బాధితులకు సకాలంలో సీపీఆర్ అందితే సాధ్యమైనంత వరకు ప్రాణాపాయం తప్పుతుందన్నారు. ఆపదలో ఉన్న వారికి సాయం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈఎంటీ రామచంద్రయ్య, పైలట్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ చౌరస్తాలో..

నందిగామ: సడన్‌గా గుండె కొట్టుకోవడం ఆగిపోయిన అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీపీఆర్ గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని 108 ఈఎంటీ గంగాధర్, పవన్‌లు అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని గాంధీ చౌరస్తాలో శుక్రవారం గ్రామస్తులకు సీపీఆర్ గురించి అవగాహన కల్పించారు.

ప్రమాదాల కూడలి


మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి

- సూచిక బోర్డులతో నిండిన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి
- వాహనాలు కనిపించక తీవ్ర అవస్థలు
- పట్టించుకోని అధికారులు

మీర్‌పేట: రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు వాహనదారులకు ప్రాణ సంకటంగా మారాయి. పక్కన నుంచి వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇదీ మీర్‌పేట్– అల్మాస్‌గూడ ప్రధాన రహదారి కూడలిలో నెలకొన్న పరిస్థితి. మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుపైనే వ్యాపార సముదాయాల బోర్డులు ఏర్పాటు చేసుకోవడంతో స్టేషన్ లోపలి నుంచి వచ్చే వాహనాలు రహదారిపైకి వచ్చేంత వరకు కనిపించకపోవడంతో నిత్యం కూడలిలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ఈ కూడలిలో రోడ్డు పూర్తి స్థాయిలో ధ్వంసం కావడంతో వేగంగా వచ్చే వాహనదారులు ఇక్కడికి రాగానే అదుపు చేయలేక కిందపడి గాయపడిన సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. ప్రధానంగా రహదారి అభివృద్ధిలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో కూడలి తరచూ ధ్వంసమవుతుందని, మూడు నెలలకు ఒకసారి మరమ్మతులు చేపట్టడం ఆ తరువాత మరలా పాడైపోవడం సర్వసాధారణమని వాహనదారులు వాపోతున్నారు.


గాయపడిన వృద్ధురాలికి సహాయం చేస్తున్న స్థానికులు (ఫైల్)

స్పీడ్ బ్రేకర్లు వేయండి



వాహనాల వేగాన్ని తగ్గించేందుకు, కూడలిలో రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. పోలీస్‌స్టేషన్ లోపలి నుంచి వచ్చే వాహనాలు కనిపించక, రోడ్డు ధ్వంసమై ఉండడం, ఇక్కడే వాహనాలు మలుపు తీసుకోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వృద్ధురాలు కిందపడి తీవ్రంగా గాయపడింది.

– రమేశ్, సిర్లాహిల్స్ కాలనీవాసి

చర్యలు తీసుకుంటాం

పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం. మీర్‌పేట పోలీసు అధికారులతో చర్చించి త్వరలోనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం. త్వరలోనే ఈ సమస్యను ఉన్నతాధికారులతో చర్చిస్తాం.

– వేణుగోపాల్, డీఈ మీర్‌పేట కార్పొరేషన్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి


బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

చేవెళ్ల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. చేవెళ్లకు చెందిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఆలూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ విజయలక్ష్మి భర్త నర్సింలు, ప్రశాంత, హైమద్ సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బీసీల రిజర్వేషన్లలో కూడా కాంగ్రెస్ పార్టీ మాట తప్పిందన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

షాబాద్: గ్రామీణ ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఐజీ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ నాగేశ్వర్‌రావు, ఆనంద్ కులకర్ణి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామంలో ఏఐజీ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


ఆమనగల్లు: వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సీజేఐపై దాడి అమానుషం

- నిందితుడిని, కుట్రదారులను అరెస్ట్ చేయాలి
- ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీశైలం, రమేశ్
- తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన

ఆమనగల్లు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ దాడిని ఖండిస్తూ శనివారం ఆమనగల్లు మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ జెండాలు చేత పట్టుకుని హైద్రాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. దాడి ఘటన వెనుక ఉన్న శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఫహీమ్ ఖాద్రీకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు వస్పుల శ్రీరామ్, సోషల్ మీడియా కన్వీనర్ జంతుక విజయ్‌కుమార్, నాయకులు కంబాలపల్లి అల్లాజీ, ఒగ్గు రాజు, మల్లే పాల్గొన్నారు.

కడ్తాల్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్.గవాయిపై దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అబ్బు రమేశ్ మాదిగ డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు సీజేఐపై జరిగిన దాడి ఘటనను సుమోటోగా స్వీకరించి నిందితుడిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ, శుక్రవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అబ్బు రమేశ్‌మాదిగ ఆధ్వర్యంలో తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. సీజేఐ గవాయిపై దాడిచేయడం అమానుషమన్నారు. ఇది న్యాయ వ్యవస్థ మీద, రాజ్యాంగ స్ఫూర్తి మీద దాడి చేయడమేనని పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్‌కే రక్షణ లేకుండా పోతే, సాధారణ దళితుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో నరేశ్, పురుషోత్తం, లచ్చిరామ్‌నాయక్, మురళీ, హరికృష్ణ, కార్తీక్, శ్రీకాంత్ ఉన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు


పశువులకు టీకా వేస్తున్న డాక్టర్ భానునాయక్

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో శుక్రవారం పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి అహ్మద్ మాట్లాడుతూ పశువులకు ముందు జాగ్రత్త చర్యగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. టీకాలు వేయడం వల్ల గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. గ్రామంలోని 197 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా తదితరులు ఉన్నారు.

మొయినాబాద్‌రూరల్: పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో పశువులకు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓఎస్ రవి, గోపాలమిత్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయిచుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మద్దూరు, రేగడిదోస్వాడ, కుమ్మరిగూడ, కక్కులూర్, అంతిరెడ్డిగూడ, గ్రామాల్లో సిబ్బందితో కలిసి పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

కడ్తాల్: పశుపోషకులు గాలికుంటు నివారణ టీకాలు విధిగా వేయించాలని మండల పశువైద్యాధికారి భానునాయక్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంతో పాటు పరిధిలోని చల్లంపల్లి, ముద్వీన్, రావిచేడ్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గాలికుంటు నివారణ టీకా పంపిణీ కార్యక్రమంలో 765 ఆవులకు, 69 గేదేలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి మధు, డాక్టర్ భానునాయక్, వెటర్నరీ అసిస్టెంట్ వెంకటయ్య, జేవీఓలు మల్లేశ్, రాజేశ్, గోపాల మిత్ర తదితరులు పాల్గొన్నారు.


మొయినాబాద్: అజీజ్‌నగర్‌లో పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న సిబ్బంది